తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త



అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శనివారం సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను తమిళనాడు, ఒడిస్సా, తెలుగు రాష్ట్రాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు స్పేస్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ గొప్పతనం ఆటోడ్రైవర్లు చాటాలి

**- జిల్లాలో ఆటోమిత్ర ద్వారా 6,777 మంది ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు రూ.10.16 కోట్లు జమ**

**- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు**

చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వ గొప్పతనంను ఆటోడ్రైవర్లు చాటాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమంను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ సహకారంను ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడి, సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంను ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలన్నారు. ఆటోడ్రైవర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వంపై వుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ లబ్దిదారుల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేకుంటే సమస్యను పరిష్కరించి అర్హులైన ఆటోడ్రైవర్లను జాబితాలో చేర్చుతామన్నారు. ఆటో, మాక్సీ క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణతో వుండి ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించకూడదన్నారు. జిల్లాలో 6,777 మంది ఆటోడ్రైవర్లకు వారి బ్యాంకు ఖాతాల్లో 10.16 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం త్వరలో రవాణా రంగంలో మంచి మార్పు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఆటోడ్రైవర్లకు తక్కువ వడ్డీతో రుణాలు అందించడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గత వైకాపా ప్రభుత్వం ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసి వెళ్ళినా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలో ఎక్కించుకుని ప్రమాదకరీతిలో ప్రయాణం చేయడాన్ని నియంత్రించుకోవాలన్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని 1,402 మంది ఆటోడ్రైవర్లకు ఈ సందర్భంగా 2,10,30,000 కోట్ల రూపాయల మెగా చెక్కును ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పంపిణీ చేశారు. ముందు చిత్తూరు గాంధీ విగ్రహం నుండి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు ఊరేగింపుగా చిత్తూరు నాగయ్య కళాక్షేత్రం వరకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, డిటిసి నిరంజన్‌కుమార్‌రెడ్డి, జడ్పి సిఇఒ రవికుమార్ నాయుడు, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీగా వెళ్తున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తదితరులు

# సోమలలో కుంభవృష్టి

## స్తంభించిన రాకపోకలు





సోమల, అక్టోబర్ 4 ప్రభాతవార్త

సోమల మండలంలో శనివారం ఉదయం నాలుగు గంటల నుంచి 9 గంటల వరకు కురిసిన వర్షంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిసిపోయాయి. పెద్దప్పరపల్లి అటవీ ప్రాంతంలో 10 సెంటీమీటర్లు వర్షపాతం నమోదు కావడంతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆవులపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం సీతమ్మచెరువు కట్ట తెంపివేయడంతో ఒక్క మారు నది ప్రవాహం పెరగడంతో పెద్ద ఉప్పరపల్లి సోమల మార్గంలోని రోడ్డుపైకి వర్షపు నీరు చేరడంతో ఉదయం 11 గంటల వరకు ఆ గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. పెద్ద ఉప్పరపల్లి నుంచి బసవపల్లి మీదుగా రాయలపేట కు పోయే రహదారిలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన డ్యామ్ తెగిపోవడంతో మూడు గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. గార్గేయ నది పరివాహక ప్రాంతాల్లో సాగుచేసిన ఐదు ఎకరాలు పూల తోటలు నీట మునిగాయి. రాంపల్లి సమీపంలో కలమందల వారి చెరువు మొరవ పోవడంతో కొద్దిసేపు రహదారులపై నీరు ప్రవహించింది. కుంభవృష్టి కురవడంతో పెద్ద ఉప్పరపల్లి యువకులు గార్గేయ నది సమీపంలోకి వచ్చి ప్రజలను అప్రమత్తం చేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. మూడు పంచాయతీల్లో చెరువులు పూర్తిగా నిండిపోవడంతో కొన్నిచోట్ల కట్టలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు పూర్తిస్థాయిలో క్షేత్ర పర్యటన చేస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది

### రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు-2025కు

## వైఎస్ గేట్ అంగన్‌వాడీ కేంద్రం ఎంపిక

కాణిపాకం, అక్టోబర్ 4ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు- 2025కు ఐరాల మండలం కామి నాయనిపల్లె గ్రామపంచాయతీ వైఎస్ గేట్ అంగన్‌వాడీ కేంద్రంను ఎంపిక చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో స్వచ్ఛాంధ్ర-2025కు రాష్ట్రస్థాయిలో 13 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 69 అవార్డులు అందజేయడానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎంపిక చేసింది. ఈమేరకు వుమెన్, చైల్డ్, డిజాబుల్ అండ్ సీనియర్ సిటిజన్ శాఖకు సంభందించి రాష్ట్రస్థాయిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాకు సంభందించి ఐరాల మండలం వైఎస్ గేట్ అంగన్‌వాడీ కేంద్రంను ఎంపిక చేస్తూ విజయవాడ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఉత్వరు వ్లు జారీ చేసింది. అలాగే గుంటూరు జిల్లా జొన్నలగడ్డ మెయిన్, ఎన్టీఆర్ జిల్లా కేదారేశ్వర పీఈటీ-111 అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక చేస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంపకం వంటి వాటిని పరిశీలించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు ఈఅవార్డుకు ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్త ఎం.రాధారాణి, ఐరాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.నిర్మలకు ఈనెల 6న విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ఈఅవార్డును సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అందజేయనున్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు ఐరాల మండలం వైఎస్ గేటు అంగన్‌వాడీ కేంద్రం ఎంపిక కావడం పట్ల ఐసీడీఎస్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తిరుపతిలో గొలుసు దొంగలు

**ఒకేరోజు ఐదుచోట్ల నేరాలు**

**బెంబేలెత్తుతున్న మహిళలు - పరుగులు తీయని పోలీసులు**

తిరుపతి, అక్టోబర్ 4ప్రభాతవార్త:




తిరుపతినగరం పరిసరాల్లో శనివారం సాయంత్రం రెండుగంటల వ్యవధిలో ఐదుచోట్ల వరుస గొలుసుదొంగతనాలు జరిగాయి. రోడ్లపై ఆయా ప్రాంతాల్లో నడచివెళుతున్న ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసుదొంగలు నేరాలకు పాల్పడ్డారు. ఓవైపు పోలీసులు డ్రోన్‌కెమెరాలతో గస్తీ చేస్తున్నా...మరోవైపు అన్ని చోట్లా సిసికెమెరాలు అమర్చి నిఘా తీవ్రం చేసినా గొలుసుదొంగలు నేరాలకు పాల్పడుతుండటంతో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి నుండి బయటకు రావాలంటే తిరుపతి మహిళలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. శనివారం సాయంత్రం మూడు గంటల నుండి ఐదు గంటల మధ్యలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగుచోట్ల, ఈస్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకచోట మహిళల మెడల్లో గొలుసులు తెంపుకెళ్ళారు. ద్విచక్రవాహనంపై వచ్చిన యువకులు షూలు ధరించి, తలలకు కర్ఛీఫ్‌లు కట్టుకుని వుండటంతో స్థానికులే ఉండవచ్చనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. బంగారు ధర భారీగా పెరగడంతో యువత సులభంగా డబ్బులకోసం మహిళలను టార్గెట్‌చేసుకున్నారనేది తెలుస్తోంది. శనివారం సాయంత్రం వేళ వరుసగా ఐదుచోట్ల గొలుసు దొంగతనాలు జరగడం మాత్రం పోలీసుల పనితీరును ప్రశ్నించేలా మారాయి. అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉపాధ్యాయనగర్, గరుడాద్రినగర్ రెడ్డిభవనం సమీపంలో, గొల్లవానిగుంట, రాయల్‌టక్‌షోరూమ్ సందులో, పోస్టల్‌కాలనీలోని సందులో మహిళలు నడచి వెళ్తుండగా వెంబడించి వారి మెడల్లో గొలుసులు తెంపుకెళ్ళారు. ఇలా వరుసగా జరగడంతో నగరంలో మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. గొలుసుదొంగలను 24గంటల్లో పోలీసులు పట్టుకునే అవకాశం ఉంది. ఈ నేరాలతో తిరుపతి జిల్లా అంతటా పోలీసులు అలర్ట్ ప్రకటించారు. నాకాబందీ తరహాలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. గొలుసుదొంగల కోసం తిరుపతి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మొత్తంమీద కొన్ని సంవత్సరాల క్రిందట ఇలాంటి నేరాలు జరిగాయి. మళ్ళీ ఇప్పుడు ఒకేరోజు ఐదునేరాలు మాత్రం పోలీసుల పనితీరును సవాల్‌చేస్తున్నాయి.

# ఉరుములు మెరుపులతో ఊదరగొట్టిన వాన



తిరుమల/తిరుపతి, అక్టోబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో శనివారం వేకువజామున 4గంటల నుండి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామునుండి ఏకధాటిగా కురిసిన వర్షంతో తిరుమల, తిరుపతి తడిసి ముద్దయ్యాయి. ఆలయం ముందు వర్షపునీరు పోటెత్తింది. ఆలయం మాఢ వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. ఉదయం 10గంటల వరకు ఈ జోరువాన కురిసింది. నగరంలోని రైల్వే అండర్‌బ్రిడ్జిలు డిఆర్‌మహల్‌రోడ్డు, ఆర్‌సిరోడ్డు, వెస్టు చర్చి ప్రాంతాల్లోని అండర్‌పాస్‌లలో మోకాలి లోతు వరకు వాననీరు చేరడంతో ప్రమాదస్థాయి ఏర్పడింది. వాహనాలను రాకపోకలను ఆపివేశారు. వరదనీటితో నగరంలోని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఆర్టీసి బస్టాండ్ వరదనీరు చేరింది. లోతట్టు శివారుప్రాంతాల్లో వాననీరు ఇళ్ళలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నంకు ఆగడంతో కొంత ఊపిరిపీల్చుకున్నారు.

# వర్క్ షాప్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

## లైజన్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 4 ప్రభాతవార్త :

ఈ నెల 7 నుండి 9 వరకు తిరుపతిలోని తాజ్ హోటల్ వేదికగా జాతీయ సహకార మంత్రిత్వ శాఖ వర్క్ షాప్ నిర్వహణ జరగనున్నదని, ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ కార్యాలయం మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి తిరుపతిలో జరగనున్న జాతీయ సహకార మంత్రిత్వ శాఖ వారు నిర్వహిస్తున్న వర్క్ షాప్ పై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డి.ఆర్.ఓ నరసింహులు, జిల్లా కోఆపరేటివ్ అధికారిణి లక్ష్మి లతో కలసి విధులు కేటాయించబడిన కమిటీలు, లైజన్ అధికారులతో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ కార్యక్రమాల అమలు పై సమీక్షించడానికి త్రైమాసిక సమావేశం జరగనుందని, ఈ సమీక్ష సమావేశానికి జాతీయ సహకార మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆశిష్ కుమార్ భుటాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ , జాయింట్ సెక్రటరీ సిద్దార్థ్ జైన్, ఆంధ్ర రాష్ట్రా లు స్పెషల్ చీఫ్ సెక్రటరీ అగ్రికల్చర్ అండ్ సెరికల్చర్ కోఆపరేషన్ , మార్కెటింగ్ బి.రాజశేఖర్ , సహకార కమిషనర్ ఏ.బాబు , సహకార శాఖ కార్యదర్శులు, సహకార సంఘాల రిజిస్ట్రార్ లతో సహా అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుండి సహకార శాఖ సీనియర్ అధికారులు, కీలకమైన జాతీయ స్థాయి సహకార సంస్థల ప్రతినిధులు , సహకార శాఖ (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) అధికారులు హాజరవుతారన్నారు. ఈ జూమ్ కాన్ఫెరెన్స్ లో ఆంధ్ర ప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఎం.డి శ్రీనాథ్ రెడ్డి, అడిషనల్ ఎస్.పి రవి మనోహరాచారి, ఆర్.డి.ఓ లు తిరుపతి, కాళహస్తి రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, డి.డి సోషల్ వెల్ఫేర్ విక్రమ్ కుమార్ రెడ్డి, ఏ.పి.ఎస్.పి .డి.సి.ఎల్ అధికారులు, డి.పి.ఓ, డి.ఎస్.ఓ,టూరిజం ఆర్.డి, తహసీల్దార్ లు, సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక ప్రక్షాళనకు వేళాయే!

**టిటిడిలో తిష్టవేసిన ఉద్యోగుల బదిలీలకు సింఘాల్ సిద్దమేనా!!**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:



ధార్మికసంస్థ టిటిడి ప్రతిష్టను..తిరుమల పవిత్రతను కాపాడటంలో ఎక్కడా ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గని టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ కొందరు ఉద్యోగుల వ్యవహారంపై చర్యలు తీసుకునే దిశగా ముందుకు కదులుతారా?అనే ప్రశ్నలు టిటిడి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలావరకు పలు విభాగాల్లో కొందరు ఉద్యోగులు ఒకేచోట తిష్టవేసి గత కొంతకాలంగా టిటిడి ప్రతిష్టను దిగజార్చేలా మెలగుతున్నారనే ఆరోపణలు, ఫిర్యాదులు టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందాయి. అంతేగాక ఈ విషయంగా సిఎం చంద్రబాబు వరకు వెళ్ళడంతో ఇప్పుడు వారందరినీ బదిలీ చేసి టిటిడిలో ప్రక్షాళన చేయాలనేది బోర్డుకూడా భావిస్తోంది. గతంలో ఈఓగా పనిచేసిన శ్యామలరావు ఈ విషయంపై సరైన నిర్ణయం తీసుకోలేకపోయారనే అపవాదు కూడా లేకపోలేదు. ఇదే సమయంలో ఈఓ బదిలీ కావడం, నూతన ఈఓగా మళ్ళీ రెండవసారి అనిల్‌కుమార్‌సింఘాల్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈఓగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దేవదేవుని బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. ఆయన దృష్టి స్వామివారి ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతం చేయడంపైనే సారించారు. ఇప్పుడు ఆయన అనుకున్న లక్ష్యం నెరవేరడంతో ఇక దీర్ఘకాలంగా ఒకేచోట తిష్టవేసి ,పాలనపరమైన అంతర్గత విషయాలను బయటకు చేరవేస్తున్న కొందరిని బదిలీ చేయనున్నారనేది టిటిడిలో గుప్పుమంటోంది. అదేగాక శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమానికి కూడా కొందరు ఉద్యోగులు, అధికారుల పనితీరుపై ,వ్యవహారశైలిపై భక్తులు ఫిర్యాదు చేయడం విశేషం. గత ఐదేళ్ళ వైసిపి బోర్డులో చాలావరకు ఉద్యోగులు తమతమకు తోచినవిధంగా ఇష్టానుసారంగా వ్యవహరించారనేది ప్రధాన ఆరోపణలు. కొందరు ఉద్యోగులు అప్పట్లో బోర్డుకు తమదైన రీతిలో అన్ని విధాలా సహకారం అందించి విభాగాల అధికారులపై కూడా పెత్తనం చేశారనేది , ఇప్పుడు వారే పెత్తనం చేస్తున్నారనేది ఛైర్మన్, ఈఓ వరకు నివేదికలు అందాయి. ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు, సిబ్బందిని బదిలీ చేయాలనేది ప్రధాన అంశంగా మారింది. బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఇప్పుడు కొందరు బదిలీలు తప్పదనేది ఉద్యోగవర్గాల్లో వినిపిస్తున్న వ్యాఖ్యలు. గతంలో ఈఓగా పనిచేసిన సమయంలో అనిల్‌కుమార్‌సింఘాల్ అప్పటి టిటిడి బోర్డు ఆదేశాలు,సూచనలను కొన్నిటిని అమలుచేయడంలో ధైర్యంగా ముందుకు వెళ్ళారనే అంశాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఇలా ఇప్పుడు తిరుమలలో అన్ని విభాగాల్లోనూ, తిరుపతిలోని స్థానిక ఆలయాలు, పరిపాలన భవనంలోని అన్ని విభాగాల్లోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని, కొందరిని పరిపాలన కారణాలతో బదిలీ చేయడమే తరువాయనేది తెలుస్తోంది. సోమవారం టిటిడి పరిపాలనభవనంలో విభాగాల్లో పనితీరుపై సమీక్షించే సూచనలు ఉన్నాయని, ఆ తరువాత బదిలీల ప్రక్రియ ఉండవచ్చనేది బలంగా వినిపిస్తున్న వాదనలు.

# క్యాష్ కొట్టు లేదా.. లారీని పక్కనెట్టు..

తొట్టంబేడు అక్టోబర్ 4 ప్రభాతవార్త



లారీ డ్రైవర్‌నుంచి డబ్బులు వసూలుచేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యవస్థలు కట్టుతప్పుతున్నాయి. ఈ నేపధ్యంలో పలు శాఖలకు సంబంధించి సాక్షాత్తు శాసనసభ్యుడే స్పందిస్తున్నారంటే అధికారులు, సిబ్బంది తీరు అర్థమౌతుంది. పలు వ్యవస్థలు 'వసూళ్ళ కేంద్రంగా' మారుతున్నాయనటానికి ఇటీవల తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సాక్షాత్తు శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి వచ్చి ఆ అధికారిపై చిరుబుర్రులాడటం గమనించదగ్గ విషయం. ఇక విద్యుత్ శాఖ వసూళ్ళ తీరు జనాన్ని భయభ్రాంతుల్ని చేస్తుంది. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళినా 'కాసుల్వినిదే' పని జరగటం లేదనే అసంతృప్తి జనాల్లో చోటు చేసుకుంది. ఈ నేపధ్యంలో శుక్రవారం వేకువ జామున తొట్టంబేడు మండల పరిధిలోని వ్యవసాయమార్కెట్ కమిటి చెక్‌పోస్టు ఉద్యోగి తీరు ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా ఉంది.

### చేతిలో డబ్బులేకుంటే ఫోన్ చేయండి:

క్యాష్‌కొట్టు లేదా లారీని పక్కనెట్టు అని లారీ డ్రైవర్లను బెదిరించి వసూళ్ళకుపాల్పడుతున్న ఘటనలు ఎక్కడో కాదు శ్రీకాళహస్తి నియోజక వర్గం తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం ఫారెస్టు చెక్‌పోస్టులో వసూళ్ళ ఉందతానికి ఇది నిదర్శనం. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి మార్గంలో ఫారెస్టు చెక్‌పోస్టు పరిధిలో సిబ్బంది తీరు రోజురోజుకు తీసికట్టుగా మారుతుంది. ఇక్కడ ఫారెస్ట్ చెక్‌పోస్టు పరిధిలో ఎర్రచందనం, కలప, అటవీ సంపద దొంగతనంగా అక్రమంగా రవాణా చేయకుండా చెక్‌పోస్టు అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే అక్కడున్న అధికారులు తమ విధులను పక్కన పెట్టి సంపదనే ధ్యేయంగా ముందుకు సాగుతూ అక్రమ రవాణాదారులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయాలకు గండి కొడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. తొట్టంబేడు మండలంలోని నాయుడుపేట రోడ్డులో ఓ చెక్‌పోస్టు, చెన్నై రోడ్డులో మరో చెక్ పోస్టు ఏర్పాటు చేసారు. ఒక కిలో మీటర్ దూరంలోనే రెండు చెక్‌పోస్టులు ఎందుకు ఏర్పాటు చేసారంటే రెండు మార్గాలు వేర్వేరు అని సమర్థించుకుంటున్నారు. చిన్నాచితకా ఉద్యోగస్తుల వల్ల ప్రభుత్వానికి పాలకులకు చెడ్డపేరు వస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని చెబుతున్నారు.

## కుప్పం బైపాస్‌రోడ్డులో విద్యుత్ వెలుగులు

**కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త** స్థానిక ఏరియా ఆస్పత్రి సర్కిల్‌నుంచి మొదలయ్యే బైపాస్ రోడ్డు నుంచి స్థానిక ఫ్లైఓవర్ వంతెన వరకు కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు వీధి లైట్లు కొత్తగా ఏర్పాటుచేయించారు. గతంలో ఉన్నలైట్లు పలుచోట్ల పనిచేయకపోవడంతో వాటి స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటుచేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## స్విమ్స్ అనస్థీషియా, కార్డియాలజీ, సి టి సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో సియంఇ



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 4, ప్రభాతవార్త** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ అనస్థీషియా, కార్డియాలజీ, సి.టి. సర్జరీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సి.ఎం.ఇ)ను శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డా ఆర్.వి. కుమార్ విచ్చేసి ప్రసంగిస్తూ, హెచ్ఓసిఎం కేసులలో సి.టి స్కాన్ అనేది హృదయ సంబంధిత రోగ నిర్ధారణకు ఉపయోగించే పరీక్షా అని, ఇది మందులు సరిగా పనిచేయనప్పుడు శస్త్ర చికిత్స పద్ధతిని సెప్టల్ మయోక్టమీ కి సిఫార్సు చేస్తారని, ఇది ఒక ఓపెన్ హార్ట్ సర్జరీ అని తెలిపారు. ఆల్కహాల్ సెప్టల్ అబ్లేషన్, ఇంప్లాంటబుల్ కార్డియోవెర్టర్ డిఫిబ్రిలేటర్ వున్న వారు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం వుంటుందని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్డియాలజీ విభాగాధిపతి డా. రాజశేఖర్, సీనియర్ ప్రొఫెసర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. వనజాక్షమ్మ, అనస్థీషియాలజీ విభాగాధిపతి డా. అలోక్ సమంత్ రేలు పాల్గొన్నారు. అనంతరం కార్డియాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. రోహిత్ కుమార్ క్లినికల్ డయాగ్నోసిస్ ఆఫ్ హెచ్ఓసిఎం, కార్డియాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. పి. వహిద్ ఖాన్, నాచరల్ హిస్టరీ ఆఫ్ హెచ్.ఓ.సి.ఎం కార్డియాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. కె. అనీల్ కుమార్, జెనటిక్ ఇన్వాల్వ్మెంట్ ఇన్ హెచ్.ఓ.సి.ఎం, కార్డియాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. ఫర్హీబ ఖనామ్ ఇ.సి.జి ఎకో ఫైండింగ్ ఇన్ హెచ్ఓసిఎం, కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆర్ ఉష రాణి, డ్రగ్ థెరపీ ఇన్ హెచ్.ఓ.సి.ఎం,కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. హరీష్ చౌదరి ఇంటర్వెన్షన్స్ ఇన్ హెచ్.ఓ.సి.ఎం సి.టి సర్జరీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. ఎన్. విష్ణు కేశవ్, సర్జికల్ అస్పెక్ట్స్ ఆఫ్ హెచ్.ఓ.సి.ఎం,అనస్థీషియాలజీ విభాగం సీనియర్ రెసిడెంట్ డా. ఎం. ఉదయ్ సూరజ్ గారు మరియు అనస్థీషియాలజీ క్రిటికల్ కేర్ కోఆర్డినేటర్ డా. మధుసూదన్‌లు సంయుక్తంగా అనస్థీషియా అస్పెక్ట్స్ ఆఫ్ హెచ్.ఓ.సి.ఎం అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.కార్డియాలజీ, అనస్థీషియా, సి.టి. సర్జరీ విభాగపు వైద్యులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో అక్టోబర్ 10 నుంచి 17వరకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 4, ప్రభాతవార్త** శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ, ఆప్తమాలజీ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 10వ తేది నుంచి అక్టోబర్ 17వ తేది వరకు ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. శ్రీవారి వైద్యసేవ పథకంలో భాగంగా హైదరాబాదుకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా ఎ.వెంకటాచలం పేషంట్లను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా క్యాటరాక్ట్ (శుక్లాలు, గ్లకోమా ఆపరేషన్లు నిర్వహిస్తారు. అవసరమైన వారు తమ యొక్క ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డ్ తెలుపు రంగు రేషన్ కార్డు తీసుకుని స్విమ్స్‌లోని శ్రీ పద్మావతి ఆసుపత్రిలో మెడికల్ రికార్డు విభాగం నందు ఓపి నమోదు చేసుకుని అనంతరం ఆప్తమాలజీ విభాగం రూమ్ నెం: 45 నందు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి వైద్యులను సంప్రదించాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానముల లోని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, ఎస్ఎల్ఎస్ఎంపిసి, సొసైటీలలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం స్విమ్స్ ఆప్తమాలజీ విభాగాధిపతిడాక్టర్ వి.ప్రభంజన్ కుమార్‌ని ఫోన్ నెంబర్‌లో 9491341561 సంప్రదించాలని అన్నారు.

## అంతర్జాతీయ జూ కీపర్స్ డే సందర్భంగా

శ్రీ వెంకటేశ్వర జంతు ఉద్యానవనంలో వేడుకలు



**తిరుపతి క్రీడ, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జంతు ఉద్యానవనం శనివారం అంతర్జాతీయ జూ కీపర్స్‌డేని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంది, తన యొక్క జంతు సంరక్షణ సిబ్బంది యొక్క అచంచలమైన నిబద్ధత కష్టాన్ని గౌరవించింది. జూ యొక్క అత్యంత విశిష్ట జంతు పరిరక్షకులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో ప్రత్యేక సమారాధన కార్యక్రమం జరిగింది. జూ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ జూ మేనేజ్మెంట్, వెటర్నరీ సిబ్బంది మరియు అన్ని జంతు పరిరక్షకులు హాజరయ్యారు. ప్రధాన అతిథిగా శ్రీ వెంకటేశ్వర జంతు ఉద్యానవనం యొక్క క్యూరేటర్, సి. సెల్వం, ఐఎఫ్ఎస్, సహాయ క్యూరేటర్ జగదీశ్ చంద్ర ప్రసాద్ సమావేశాన్ని ప్రసంగించారు. వన్యప్రాణి సంరక్షణలో మరియు జంతు సంక్షేమంలో జంతు పరిరక్షకులు చేస్తున్న ప్రముఖ పాత్రను ప్రశంసించారు. తన ప్రసంగంలో సి. సెల్వం జంతు పరిరక్షకులే ఏదైనా జంతు ఉద్యానవనం యొక్క నిజమైన వెన్నెముక అని నొక్కి చెప్పారు. జగదీశ్ చంద్ర ప్రసాద్ ఈ భావనలను ప్రతిధ్వనిస్తూ, ఈ ఉద్యోగానికి అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు, నిబద్ధతను హైలైట్ చేశారు. శ్రీ వెంకటేశ్వర జంతు ఉద్యానవనం యొక్క నిర్వహణ, తన సిబ్బందికి మద్దతు ఇవ్వడానికి మరియు ఎక్స్‌సిటు సంరక్షణ, విద్య, పరిశోధన యొక్క మిషన్ను కొనసాగించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించిందన్నారు.

## అన్నదానానికి బెంగుళూరు వాసుల విరాళం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాయలం లో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దేశ విదేశీయులచే స్పందన లభిస్తుంది. ఇక్కడ భోజనం చేసిన ప్రతి ఒక్కరు విరాళాలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం బెంగుళూరుకు చెందిన ముక్తేశ్వర్‌నాగారాణి సుముఖ్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత నిత్యాన్న ప్రసాదంలో భోజనం చేసారు. వారు స్పందించి వెంటనే నిత్యాన్నదాన పథకానికి విరాళాల వివరాలను ఎఇఒ మోహన్‌తో చర్చించారు. దాంతో వారు రూ.1,00,116ల చెక్కును ఆలయ ఇఒ డి.బాపిరెడ్డికి అందించారు. వారికి ఆలయం తరఫున స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## నాయకుల పటాలకు పాలాభిషేకాలు



**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త** ఏర్పేడు మండల కేంద్రంలో శనివారం ప్రభుత్వం ప్రకటించిన 'వాహన మిత్ర' పథకంలో ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ.15వేలు అందించే కార్యక్రమాలను రాష్ట్ర తెలు గుదేశం పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి సారధ్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారాలోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా ఆటో ర్యాలి నిర్వహించారు. ఆటో డ్రైవర్లు ఓ వైపు వర్షం కురుస్తున్నా లెక్క చేయక ర్యాలిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో గురువారెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు కృష్ణవేణి, కందాటి మహేష్‌రెడ్డి,సదాశంకర్‌నాయుడు, మునీంద్రయాదవ్, గోపాల్‌రెడ్డి, నిరంజన్ బాబు, రమణయ్య, ఆటో నాయకులువెంకటేష్,మహేష్, చెంగల్‌రాయులు, బాలగున్నయ్య పాల్గొన్నారు.

## పవన్‌ను కలసిన దండి

**శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 4 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ధర్మకర్తలి మండలి సభ్యులుగా ముచ్చివోలు గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు దండి.రాఘవయ్యకు అవకాశం కల్పించారు. ఆ పార్టీ అధినేత ఉపముఖ్యమంత్రి పవ న్‌కళ్యాణ్‌ను ఆయన క్యాంప్ ఆఫీసులో కలిసి కృత జ్ఞత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినం దుకు తాను రుణపడి ఉన్నానని దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.పార్టీని గ్రామాగ్రామాల్లో ముందుకు తీసుకెళ్ళి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.సద్వినియోగం చేసుకుని అభివృద్ధికి తొడ్పాటును అందిస్తామన్నారు.

## మేము సైతం ప్రజా సేవ కోసం

**పాలసముద్రం, అక్టోబర్ 4 ప్రభాతవార్త**



మండల ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్న పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రతే పోలీస్ బాధ్యత అని పాలసముద్రం ఎస్సై చిన్న రెడ్డప్ప అన్నారు. ఎస్సై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. .ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కు గాని లేకపోతే పోలీసు అత్యవసర నెంబర్ 112 గాని ఫోన్ చేస్తే తక్షణమే ప్రమాద స్థలానికి చేరుకుని ప్రమాదం నుంచి కాపాడి వారికి న్యాయం చేస్తామని అన్నారు.ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ప్రజలు అందరూ పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మండలంలో రీచ్ నుంచి ఇసుక తరలించే చాలా ట్రాక్టర్లకు నెంబరు ప్లేటు లేకుండా నడుపుతున్నారని, తప్పకుండా ట్రాక్టర్, ట్రాలీ కి నెంబరు ప్లేటు అమార్చాలి లేనియెడల అలాంటి వాహనాలు ఇసుక తరలించడానికి అనుమతించబడవని మరియు వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీస ఎకుంటామని వాహన యజమానులను హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా కోడి పందేలు,పేకాట ఆడితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని, కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు తెలిపారు.

## ఉత్తమ ప్రభుత్వ కార్యాలయంగా కడ



**కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర అవార్డులకు కుప్పంలోని కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) కార్యాలయం ఉత్తమ స్వచ్ఛ కార్యాలయంగా ఎంపికైంది. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ కడ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచేలా తగు చర్యలు చేపట్టారు. కార్యాలయ ఆవరణలో పచ్చటి చెట్లు ఏర్పాటు చేయించడ ంతో పాటు చెత్త చెదారాలు కార్యాలయ ఆవరణలో పడేయకుండా ఎక్కడికక్కడ చెత్త కుండీలు ఏర్పాటుచేయించారు. అలాగేకార్యాలయంకు వచ్చేప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక్కటి వసతులు కల్పించారు. కార్యాలయ ఆవరణలో పర్యావరణం పెంపొందించేలా మినీ గార్డెన్ ఏర్పాటు చేయించారు. ఇలా చక్కటి వసతులతో కూడిన కడ కార్యాలయం స్వచ్ఛ కార్యాలయంగా రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం విశేషం.

## కెనమాకులపల్లి పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు



**శాంతిపురం, అక్టోబర్ 4 ప్రభాతవార్త** మండలంలోని కెనమాకులపల్లి పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు రావడం జరిగిందని ఈనెల 6న సిఎం చంద్రబాబునాయుడు ఈ అవార్డును అందిస్తారని ఎంపిడిఒ పిఆర్ కుమార్ తెలిపారు. శాంతిపురం మండలాన్నిస్వచ్ఛ శాంతిపురంగా మార్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. 80లక్షలతో ప్రతి పంచాయతీకి మూడు లక్షల విలువ గల ఇ –ఆటోలు మంజూరు చేశారన్నారు. మండలంలో అరవై మంది క్లాప్ మిత్రలు పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా నవంబర్ 15 నుంచి రైతులకు సేంద్రీయ ఎరువుల విక్రయాలు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ల పర్యవేక్షణలో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## 7న రాష్ట్ర స్థాయి వేడుకగా మహర్షి వాల్మీకి జయంతి

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** అక్టోబర్ 7వ తేదీన రాష్ట్ర స్థాయి వేడుకగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించాలని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కమీషనర్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని వివేకానందభవన్‌లోని రెండవ ఫోర్‌లోని కలెక్టర్స్ మీటింగ్ హాలులో మంగళవారం ఉదయం 10 గంటలకు వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బిసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీభాషా తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూతమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు.

## గణనాధుడిని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు జడ్జి



**కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ గీత కడబ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఎఇఒ ఎస్వీ కృష్ణారెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. వారి వెంట ఆలయ సూపరిటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**గుడిపాల, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు–వేలూరు రహదారిలో పానాటూరు గ్రానైట్ ఫ్యాక్టరీకి సమీపంలో ఈ నెల 19వ తేదీ జరిగిన తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 19వ తేదీన పానాటూరు గ్రానైట్ ఫ్యాక్టరీకి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రంగా గాయాలు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి అతనిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## జ్యోతిరావు పూలే విగ్రహానికి కొత్త మెట్లు

**చిత్తూరుహెల్త్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే విగ్రహానికి కొత్తగా స్టీల్ మెట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌ను ఆదేశించారు. ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొనడానికి గాంధీ విగ్రహం వద్దకు వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం కలిసి జ్యోతిరావుపూలే విగ్రహానికి ప్రస్తుతం వున్న మెట్లు తుప్పుపట్టి వున్నాయని, వీటి స్థానంలో కొత్త మెట్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అక్కడికక్కడే సత్వరం జ్యోతిరావుపూలే విగ్రహానికి ప్రస్తుతం వున్న మెట్లు తొలగించి వాటి స్థానంలో కొత్త స్టీల్ మెట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌ను ఆదేశించారు.

## ఆటో నడిపిన ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాలలు



**చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ఆటోమిత్ర, ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన నివాసం నుండి ఆటో నడుపుతూ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బివిరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నివాసం నుండి ఎమ్మెల్యే గురజాల, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు ఆటో ఎక్కారు. ఎమ్మెల్యే గురజాల ఆటోను నడుపగా, ఎంపీ దగ్గుమళ్ళ ఎమ్మెల్యే ప్రక్కన కూర్చొని ఆటోమిత్ర, ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొనడానికి గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి జరిమానా

**చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మంది ద్విచక్రవాహనదారులు ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 1.30 లక్షల రూపాయలను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. చిత్తూరు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 13 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారన్నారు. వీరిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిస్తే జడ్జి ఉమాదేవి మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఎఐఎంఎస్‌ఆర్‌లో నూతన రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం



**చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్‌లోని బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శనివారం జీనోమిక్స్ ఇన్ఫర్మెటిక్స్ రీసెర్చ్ ల్యాబ్(జిఐఆర్ఎల్)ను వైస్ చాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ ఈ ల్యాబ్ ముఖ్యంగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల పరిశోధనకు అనుకూలంగా రూపొందించబడిందని, ఇక్కడ విద్యార్థులు హ్యాండ్స్ ఆన్ శిక్షణ, డేటా విశ్లేషణ సెషన్లు, ఇంటర్ డిసిప్లినరీ ప్రాజెక్టుల్లో పాల్గొని పరిశోధనాత్మక విద్యను అభ్యసించ వచ్చునన్నారు. ఈ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలు, కంప్యూటర్ సదుపాయాలు, డేటా విశ్లేషణ సాఫ్ట్ వేర్‌లు ఏర్పాటు చేసి జీనోమిక్స్ బయోఇన్ఫర్మాటిక్స్, బయోకెమిస్ట్రీ పరిశోధనలకు సౌలభ్యం చేసి అందించ నున్నామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ పోతురాజు, ఎఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ జె.ఆగస్టిన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పి.నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 166 భాషా పండితులకు పదోన్నతులు



**చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:** ప్రభుత్వం 2019 లో నిర్వహించిన భాషా పండితుల ఉన్నతీకరణ పదోన్నతుల్లో ఎస్జీటీలకు స్థానం కల్పించడంతో డిఇఓ పూల్‌లోకి వెళ్ళిపోయి విధులు నిర్వహించడానికి స్థిరమైన ప్రదేశం లేకపోవడంతో సుదీర్ఘకాలంగా పదోన్నతులు రాకపోవడంతో నిరాశతో వున్న భాషా పండితులకు ఎట్టకేలకు పదోన్నతులు లభించాయి. జిల్లాలో 166 మంది భాషా పండితులకు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ పదోన్నతులు కల్పిస్తూ వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చిత్తూరు ఉమ్మడి జిల్లా ఎస్ఎల్‌టిఎ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. డిఇఓ పూల్ భాషా పండితుల పదోన్నతులపై తమ యూనియన్ ఆరేళ్ళుగా అలుపెరుగని పోరాటం సాగించిందని, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య దాఖలు చేసిన రిట్ పిటీషన్‌పై హైకోర్టు తుది తీర్పు వెలువరించడంతో భాషా పండితులకు ప్రస్తుతం పని చేస్తున్న స్థానంలోనే పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆపై జరిగే బదిలీల్లో వీరిందరినీ ఖాళీ స్థానాల్లో సర్దుబాటు చేయాల్సిందిగా డిఇఓలను పాఠశాల విద్యాకమీషనర్ విజయరామరాజు ఆదేశించారన్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగు 123, హిందీ 34, ఉర్దూ2,తమిళం6,సంస్కృతం1 భాషా పండితులు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయన్నారు.

## మహిళ ఆత్మహత్య

**కుప్పం, అక్టోబర్ 4ప్రభాతవార్త**

కుప్పం పట్టణంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగు చూసింది. హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి తెలిపిన మేరకు వివరాలిలా.. మున్సిపల్‌పరిధి సామగుట్టపల్లి గ్రామంకు చెందిన ముత్తు భార్య లక్ష్మి స్థానిక వజ్రవేలుశెట్టి వీధిలో ఓ ఇంట్లో అద్దెకు ఉండేవారన్నారు. కాగా లక్ష్మి శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకునిమృతి చెందిందన్నారు. మృతదేహాన్నిపంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మేనిఫెస్టో అమలు ఘనత సిఎం చంద్రబాబుదే



ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్
– కుప్పంలో ఆటోవాలాల భారీ ర్యాలీ ..
547మంది ఆటో డ్రైవర్లకు లబ్ది !!

**కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త** ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టో అమలుతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం ఆటో డ్రైవర్లసేవలో కార్యక్రమంలో భాగంగా కుప్పం పట్టణంలో ప్రజాప్రతినిధులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో 547మంది ఆటో డ్రైవర్లకు 86లక్షల మేరలబ్ది కలుగుతోందన్నారు. అర్హులు ఇంకా మిగిలి ఉంటే సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పిస్తే పథకంలో లబ్ది కలుగుతుందన్నారు. ఏడాది న్నర కాలంలోనే సూపర్ సిక్స్ పథకాలు ప్రజల దరి చేర్చిన ఘనతకూటమి ప్రభుత్వానికే దక్కుతుం దన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పథకం, 16847పోస్టులతో మెగా డిఎస్సీ, బిసిలకుప్రత్యేక చట్టం అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఓ వైపు ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలు సిఎం అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఇబ్బం దులులేకుండా ఏటా 15000రూ.లు ఇవ్వాలని తద్వారా ఆటో కార్మికులకుఅండగా నిలవాలని సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్‌సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జి అప్పు, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సోమశేఖర్, సురేష్, ఆర్టీఒ, ఉమాపతి, స్థానిక నేతలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## గువ్వల ఇంటికి అనిమిని

–శాప్ ఛేర్మన్‌కు ఘనస్వాగతం



**చౌడేపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త** మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ తెల్లనీళ్లపల్లిలో గల తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి)స్వగృహానికి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)ఛేర్మన్ అనిమిని రవినాయుడు వచ్చారు. ఆయనకు గువ్వలతో పాటు తేదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛమందించి దుశ్శాలవాలతో సత్కరించారు. సమకాలిన రాజకీయాలపై ఇరువురు చర్చించుకొన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడారంగానికి చేస్తున్న కృషినీ, ప్రజారంజక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని దిశా నిర్దేశం చేసారు. నాయకులు మాధవరెడ్డి, బోయకొండ సుబ్బు, పవన్, అర్జున్‌రాయల్, పాళెంరెడ్డి, సోము, మాజీ సర్పంచు వెంకట్రమణ, ఎనమసానిపల్లి నాగరాజరెడ్డి, సుదర్శనరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాతి మసీదు భూములను కాపాడండి

–తహశీల్దార్‌కు వినతి



**చౌడేపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త** పుంగనూరు రాతి మసీదు భూములను కాపాడాలని ముస్లిం మైనార్టీ సోదరులు, కౌలు రైతులు కోరారు. శనివారం ఈమేరకు వారు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటి రామ్మూర్తికి వినతిపత్రమందించారు. శతాబ్దాల క్రితం పుంగనూరు జమీందారులు రాతిమసీదు నిర్వహ ణకు కాటిపేరి పంచాయతీ గురుముర్ధనపల్లి సమీపంలో 496ఎకరాల భూమిని అందించారన్నారు. ఆయా భూముల్లో గ్రామానికి చెందిన రైతులకు కౌలుకు ఇచ్చామనీ, వారందరూ వందేళ్ళ నుంచి సాగు చేసుకొని కౌలు మొత్తాన్ని ధనం, ధాన్యం రూపంలో మసీదుకు ఇస్తున్నారన్నారు. అయితే భూములకు విలువలు పెరగడంతో కొందరు స్వార్థ పరులు దళారీ అవతారమెత్తి కోట్లాది విలువ చేయు రాతి మసీదు భూములకు నకిలీ రికార్డులు సృష్టించి కాజేయాలని చూస్తున్నారనీ, సర్వే చేయించి తమ భూములను కాపాడాలని వారు కోరారు. పుంగనూరు రాతి మసీదుకు చెందిన ముస్లిం, మైనార్టీ సోదరులు, గురుమర్ధనపల్లి కౌలు రైతులు పాల్గొన్నారు.

## హుండీ ద్వారా రూ. 62.21లక్షల ఆదాయం



**బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 4 ప్రభాతవార్త** శక్తి స్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ ద్వారా రూ. 62,21,142లు ఆదాయంగా సమకూరినట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఆలయంలో 68రోజులకు గాను నిర్వహించిన హుండీ లెక్కింపులో నగదుతోపాటు 72గ్రాముల బంగారం, 705 గ్రాముల వెండి, వివిధ దేశాల విదేశీకరెన్సీని భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారన్నారు. అదే విధంగా రణభేరీ గంగమ్మ హుండీద్వారా రూ. 46,310లు ఆదాయంగా వచ్చిందన్నారు. జిల్లా దేవాదాయధర్మాదాయ శాఖ ఎసీ చిట్టెమ్మ, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది, సేవక్ మహిళలు పాల్గొన్నారు.



## శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**కల్లూరు, అక్టోబర్ 4, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం జాండ్రపేట శ్రీమల్లేశ్వం స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు పెరటాసి నెల మూడవ శనివారం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు ఆలయంలో స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక అలంకరణ అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులు గోవింద భక్తి గీతాలు ఆలపించారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేయడం హేయమైన చర్య

కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముటుకూరు జగపతి



**పూతలపట్టు, అక్టోబర్ 4, ప్రభాతవార్త:** వెదురుకుప్పం మండలంలోని దేవళంపేట గ్రామంలో డా. బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేసిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి ముటుకూరు జగపతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దేవళంపేట గ్రామంలో నిప్పు పెట్టడం చాలా హేయమైన చర్య అని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలో మన భారతదేశాన్ని ఉన్నతమైన స్థితిలో ఉంచడానికి సమాజంలో ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ మంచి వాతావరణం ఏర్పాటు చేయడం మనందరి బాధ్యత అని, షెడ్యూల్ కులాలు భద్రత గౌరవం కాపాడటంలో కమిషన్ కట్టుబడి ఉందని, సామాజిక న్యాయం పత్రికలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించుకోమని జగపతి హెచ్చరించారు.

## ఆటో డ్రైవర్లు లబ్ధిదారులకు నగదు పంపిణీ కార్యక్రమం



**పూతలపట్టు, అక్టోబర్ 4, ప్రభాతవార్త** నియోజకవర్గ స్థాయిలోని అన్ని మండలానికి చెందిన పూతలపట్టు యాదమరి, బంగారుపాలెం తవణంపల్లి ఐరాల నియోజవర్గంలో ఆటో డ్రైవర్లు సేవలో అనే కార్యక్రమం పూతలపట్టు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు ఏడాదికి 15 వేల రూపాయలు ఇవ్వనన్న ప్రభుత్వం 2.90 లక్షల మందికి రూ 436 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గుంటూరు మురళి మండల కన్వీనర్ దొరబాబు చౌదరి మాజీ కన్వీనర్ చంద్రమౌళి నియోజవర్గంలో నాయకులు ప్రజాప్రతినిధులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఆటో డ్రైవర్ సేవ ర్యాలీ



**పలమనేరు టౌన్,అక్టోబర్ 4 ప్రభాతవార్త:** పలమనేరులో శనివారం ఆటో డ్రైవర్లు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ సేవ పథకం ద్వారా రూ.15వేలు ఆటో కార్మికుల ఖాతాలో జమ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ ంలోని మార్కెట్ వద్ద నుండి చిత్తూరు డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి,డిఆర్డిఎ పిడి శ్రీదేవి,ఎంవిఐ మధుసూదన్,మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి,మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు

**శాంతిపురం, అక్టోబర్ 4 ప్రభాతవార్త** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ శతజయంతి ఉత్సవాలను శాంతిపురంలో ఘనంగా నిర్వహించారు. హైందవుల చైతన్యం కొరకు ఈకార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కుప్పం కండకర్యవహ అనంతశయనం, రాయలసీమ సహ ప్రముఖ్ రాఘవేంద్ర, బిజెపి మండల అధ్యక్షుడు గజేంద్ర, వీర రాఘవులురెడ్డి, మంజునాథ స్వామి, యువ మోర్చా అధ్యక్షుడుచంద్రశేఖర్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు కిషోర్, విహెచ్‌పి మండల అధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

## హామీ ఇవ్వకున్నా అమలు చేస్తున్న ప్రభుత్వం:ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: ఎన్నికల్లో ఎటువంటి హామీ ఆటోడ్రైవర్ల సంక్షేమం గురించి కూట మి ప్రభుత్వం ఇవ్వకున్నా ప్రస్తుతం వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆటోడ్రైవర్ల సేవ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సహాయాన్ని అందించిన ఘనత చంద్ర బాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మహిళలకు రాష్ట్రంలో కల్పించిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్లకు నష్టం కలుగుతుందని భావించి ఆటో డ్రైవర్ల సేవ అనే పేరుతో వాహన మిత్ర కార్యక్రమంలో భాగంగా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి శనివారం పట్టణంలోని శేషసాయి కల్యాణ మండపంలో భారీ కేక్ కట్ చేసి ఆటోడ్రైవర్లతో కలిసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఆటోలతో భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్డీఓ కిరణ్మయి, ఆర్‌టిఓ అనిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పచ్చా మాధవనాయుడు, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## అక్రమ కట్టడానికి తొలగించిన అధికారులు



బాలాయపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: మండలంలోని మేల్చూరు గ్రామంలో చింతలపల్లి శివరాం ప్రసాద్ అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని రెవెన్యూ సిబ్బంది పోలీస్ బందోబస్తు మధ్య తొలగించారు. తనకిచ్చిన ఇంటి స్థలాన్ని శివరాం ప్రసాద్ దౌర్జన్యంగా ఆక్రమించి అక్రమంగా ఇల్లు నిర్మించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ అనంతరం శివరాంప్రసాద్ అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని హైకోర్టులో విచారణ అనంతరం శివరాంప్రసాద్ అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. దీంతో తాసిల్దార్ విజయలక్ష్మి, సిఐ ఏవి రమణ, ఎస్సై కామినేని గోపి, ఆర్ఐ శ్రీకాంత్ సిబ్బందితో వెళ్లి తొలగించారు.

## ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎందే:ఎమ్మెల్యే



వెంకటగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: సీఎం చంద్ర బాబు నాయుడు హామీ ఇచ్చారంటే అది నెరవేర్చి తీరుతారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆటో డ్రైవర్ సేవ పథకంలో భాగంగా వెంకటగిరి పట్టణ పురవీధుల్లో ఎమ్మెల్యే రామకృష్ణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిసిఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు ఆటోలో ప్రయాణించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని కూటమి ప్రభుత్వ నెరవేర్చిందని చెప్పారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు 15000 ఇచ్చే పథకం పెట్టలేదని అయినా వారి సంక్షేమ కోసం ఇస్తున్నట్లు చెప్పారు. డిసిఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమ కోసమే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లను సత్కరించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్ రావు,ఎంపీపీ తనుజా రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్‌లో సీసీ నాయుడు, రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమోళిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, సిఐ ఏవి రమణ, ఎస్సైలు ఏడుకొండలు, కామినేని గోపిలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : ఎంపిడిఓ




కోట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: సర్వ సభ్య సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అడిగిన సమస్య లను పరిష్కరిస్తామని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి భవన ంలో మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు దారా సురేష్, మొబిన్‌బాషా, షంషుద్దీన్, లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ కోటలో విద్యుత్ స్తంభాలు రోడ్డు పక్కన పడేసి నాలుగేళ్ల దాటుతున్నా నేటి వరకు విద్యుత్‌లైన్లు లాగలేదని, దీంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. చల్లకాలువ వద్ద ఇసుక దిమ్మెలు పేరుకుపోయినందున సజావుగా వర్ష ప్రభావం కదలడం లేదని, పేరుకుపోయిన ఇసుక దిమ్మెలు తొలగించాలని కోరారు. దీంతో తహశీల్దార్ కె.జయజయరావు స్పందిస్తూ అక్కడ ఇసుక దిమ్మెలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపాలెంలో పశువుల డాక్టర్ లేరని, దీంతో మూగజీవాలు చనిపోతున్నాయని ఆరోపించారు. అనంతరం వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మునికుమారి మాట్లా డుతూ ప్రాజెక్టు పరిధిలో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పథకాలపై వివరించారు. ఎంఇఓ మస్తానయ్య మాట్లాడుతూ కోటకు ఉర్దూ పాఠశాల మంజూరైందని, ముస్లింల పిల్లలు ఆ పాఠశాలలో చేరవచ్చని తెలిపారు. అనంతరం ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గైర్హాజరైన అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో జడ్పిటిసి కోటయ్య, ఎస్ఐ పవన్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలు సాగుకు ప్రభుత్వం చేయూత

డక్కిలి,అక్టోబరు 4 ప్రభాతవార్త : ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం చేయూతనంది స్తున్నట్లు వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి జి.ఆనంద్ తెలిపారు. మండలంలోని మహ సముద్రం గ్రామంలో సాగు చేస్తున్న నిమ్మ మొక్కలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు గత ఏడాది కన్నా ఈఏడాది ప్రభుత్వం ఇచ్చే సబ్సీడీని పెంచినట్లు చెప్పారు.ఆసక్తి ఉన్న రైతులు దగ్గరలో ఉన్న రైతు సేవాకేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

## ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త : ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్థానిక బైపాస్ సర్కిల్ వద్ద జండా ఊపి ఆటో ర్యాలీ ప్రారంభించి, ఆటోలో ప్రయాణించారు. అనంతరం ఆటో డ్రైవర్లతో ఆది శంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని అన్నారు. ఎన్నికల హామీల్లో లేనప్పటికీ చంద్రబాబు ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఈ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డిఎస్పి గీత కుమారి, నాయకులు శీలం కిరణ్ కుమార్, రహీం, బిల్లు చెంచు రామయ్య, నెలబల్లి భాస్కర్ రెడ్డి, జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్, పట్టాభిరామిరెడ్డి, కొండ రామచంద్రారెడ్డి, మట్టం శ్రావణి రెడ్డిగుండాల లీలావతి, గుండాల భారతి శ్రీదేవి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్‌రెడ్డికి అభినందనల వెల్లువ

కోట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించడం పట్ల పార్టీలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా ఆర్గనైజర్ ఉప్పల ప్రసాద్ గౌడ్, అల్లంపాడు సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవరాల రాంబాబు తదితరులు శ్యాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వరునికి శాకాంబరి అలంకారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ మద్వేంకట రామమూర్తిస్వామి దేవస్థానంలో పెరటాశి నెల మూడవ శనివారాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరునికి శాకాంబరి అలంకారం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ అనంతకుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

## ఘనంగా శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: పట్టణంలోని రాష్ట్ర మాజీ నాటక కళా పరిషత్ డైరెక్టర్ కళత్తూరు శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు భారీ పూలమాలలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, నరేష్, కళత్తూరు జనార్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన




సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త : పట్టణంలోని నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు హరి, మునిశేఖర్, సోనియా, దివ్య, లావణ్య, ఎఎన్ఎంలు మంజుల, నందిని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ పోషణ మాస వారోత్సవాలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పేర్నాడు అంగన్‌వాడీ పాఠశాల ఆవరణలో 8వ రాష్ట్రీయ పోషణ మాస వారోత్స వాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శిరీష, భవాని, సుభాషిణి, నిర్మల పాల్గొని ప్రతి ఒక్కరూ చక్కెర, ఉప్పు, బియ్యం వాడకాన్ని తగ్గించి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

## జిఎస్‌టి సంస్కరణలపై అవగాహన

సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని స్థానిక మున్సిపాలిటీ కమషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి, వ్యాపార సంస్థలకు వెళ్లి జిఎస్‌టి తగ్గింపునకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి ఆఫీసర్ భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోండి

సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి కించపరిచిన దుండగులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మాలమహానాడు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆవుల దాస్ డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా దేవలంపేట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుందని, దీనిపై అసలైన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని దాస్ కోరారు.

## కేంద్ర కమిటీ సభ్యులుగా బొమ్మిరెడ్డి



వెంకటగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త : మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, సీనియర్ వైసీపీ నాయకులు బొమ్మిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని వైసిపి కేంద్ర కమిటీ సభ్యులుగా నియమిస్తూ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తరాలు జారీ చేశారు. మాజీ జడ్పీ ఛైర్మన్ రాఘవేందర్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా కూడా వ్యవహరించారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి



వెంకటగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా ఎదురు కుప్పంలో అంబేద్కర్ విగ్రహాన్ని దహనం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య తెలిపారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళం పేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఉద్దేశపూర్వకంగా పూరి గుడిసె నుండి మంటలు పెట్టినటువంటి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్లో ప్రదర్శన బోర్డు పనిచేయడం లేదు :ఎమ్మెల్యే



వెంకటగిరి, అక్టోబర్4, ప్రభాతవార్త రైల్వేస్టేషన్లో కొన్ని నెలల నుండి ప్రదర్శన బోర్డు పని చేయడం లేదని వెంటనే పునరుద్ధరణ చేయించాలని స్టేషన్ మాస్టరుకి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలి పారు. వెంకటగిరి రైల్వే స్టేషన్ మాస్టర్ను ఎమ్మెల్యే, డిసిఎంఎస్ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరరావు టిడిపి నాయకులు కలిశారు. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, ఇంకా పలు రైళ్లు ఆగక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది గురవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్లు సిసి నాయుడు, రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలు పాటించని దుకాణదారులపై చర్యలు



వెంకటగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: నిబంధనలను పాటించని ఎరువుల దుకాణదారులపై చర్యలు తీసుకుంటా మని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు తెలిపారు. వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు ఎరువుల షాపులనందు తనిఖీలు చేశారు. షాపుల యజమానులు కచ్చితంగా స్టాక్ వివరాలు రిజిస్టర్‌లో పొందుపరచాలని తెలిపారు. రైతులకు విక్రయించే చెరువులను ఎక్కడ ఇస్తే బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. ఇందులో భాగంగా ఎరువుల షాపులకు సంబంధించి యూరియా స్టాకు నిల్వలను పరిశీలించారు. వెంకటగిరి పట్టణం నందు గల ఎరువుల షాపుల డీలర్లు అందరూ తప్పకుండా ఎరువుల లైసెన్స్ నందు ఫారములను నమోదు చేసుకుని వ్యాపార లావాదేవీలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ వ్యవసాయ అధికారి ఎన్ రామాంజనేయరెడ్డి, ఎస్సై రామకృష్ణ నాయక్, ఏడిఏపి అనసూయ, స్థానిక మండల వ్యవసాయ అధికారిని పి సుజాత, డీలర్లు పాల్గొన్నారు.

## తహసిల్దారుకు ఘన సత్కారం



వాకాడు, అక్టోబర్ 4 ప్రభాతవార్త: తహసిల్దార్ కార్యాలయంలోని శనివారం ప్రిన్సిపాల్ కిషోర్, గురుకుల సిబ్బందితో తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సత్కారంలో గురుకుల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

## టిటిడిచే కమనీయంగా శ్రీవారి కళ్యాణోత్సవం

**- తిలకించేందుకు హాజరైన వేలాది భక్తులు.. మార్మోగిన గోవిందనామస్మరణ!!**



కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్స వాన్ని శనివారం మండలంలోని శ్రీ బేటరాయస్వామి ఆలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల కళ్యాణోత్స వంను తిలకించేందుకు భక్తులువేల సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణోత్స వం సందర్భంగా టిటిడి అర్చకులు తిరుమల నుంచి తీసుకువచ్చిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి కన్నులు మిరమిట్లు గొలిపేలా అలంకరించారు. ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ దంపతులు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. స్వర్ణాభరణ శోభితులై శ్రీనివాసస్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తజన కోటి గోవిందా అంటూ నామస్మరణ చేస్తూ కళ్యాణోత్స వంను అత్యంత భక్తి శ్రద్ధలతో తిలకించి తన్మయత్వం పొందారు. ముహూర్త ఘడియల సందర్భంగా టిటిడి అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివాహ వేడుకలు ఘనంగా జరిపారు. టిటిడిలో సంప్రదాయ బద్ధంగా సాగే రీతిలోనే స్వామి వారి కళ్యాణోత్స వంను నిర్వహించారు. కళ్యాణోత్స వం ముగింపు కార్యక్రమం సందర్భంగా దేవదేవుడు అమ్మవార్లతో కలసి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కళ్యాణోత్స వం తిలకించడం ఎంతో అదృష్టమని అర్చకులు పేర్కొన్నారు. కళ్యాణోత్స వంకు హాజరైన దంపతులు సంప్రదాయ రీతిలో వస్త్రాలు ధరించి హాజరయ్యారు. కళ్యాణోత్స వం సందర్భంగా బేటరాయస్వామి కొండ ప్రాంతం ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంను తిలకించేందుకు నియోజకవర్గం నుంచే కాక కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో తరలి వచ్చారు. భక్తు లకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా నిర్వాహకులు వాహనాలకు పార్కింగ్ వసతి, మంచినీటి వసతికల్పించారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం జరిపించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ,కడ ఛైర్మన్ డా కంచర్ల శ్రీకాంత్ దంపతులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం దంపతులు, పికెఎం ఉడా ఛైర్మన్ బి.ఆర్.సురేష్‌బాబు దంపతులు, సిఎం పిఏ మనోహర్ దంపతులు, బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం దంపతులు, స్థానిక

## ఎంపీ మిధున్‌రెడ్డిని కలసిన చిందేపల్లి



పెళ్లకూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త : ఎంపి మిధున్ రెడ్డిని పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామానికి చెందిన మాజీ వైయస్సార్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ చిందేపల్లి. మధుసూదన్ రెడ్డి శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎవరిది న్యాయం అన్నది కోర్టులో న్యాయదేవత చూస్తోందని అక్కడే న్యాయం జరుగుతుందని అభిప్రాయాన్ని వెల్లడించారు.

## జుమ్‌లేషా పీర్ షావలి దర్గాను దర్శించుకున్న సుమన్



శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి స్వర్ణముఖి ఒడ్డున వెలసియున్న జుమ్‌లేషా పీర్ షావలి దర్గాను సినీ నటుడు సుమన్ శనివారం దర్శించుకున్నారు. పీర్ షావలి దర్గా ఎంతో మహిమాన్విత కలిగినదని, నేను వచ్చిన ప్రతిసారి దర్గాను దర్శించి, ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయనకు దర్గా నిర్వాహకులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు షాకీర్‌ఆలీ జమీల్, గరికపాటి రమేష్, న్యాయవాది రాజేశ్వరరావు, మునీర్‌బాషా, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**-పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం**



తవణంపల్లె, అక్టోబర్ 4 ప్రభాతవార్త: మండలంలో శుక్రవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గత 10 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని నదులు, వాగులు వంకలు ఒక మోస్తరుగా ప్రవహిస్తున్నాయి. అయితే శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం ఉదయం వరకు మండలంలో భారీ వర్షాలు కురవడంతో ఈవాగులు, వంకలు, నదులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని పడమటి సరిహద్దు మండలాల్లోని అటవీ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షాలు కురవడంతో వరదనీరు భారీగా మండలానికి వచ్చి చేరుతోంది. దీనితో మండలంలోని అరగొండ సమీపంలో బహుదానది, గొడ్డువంక, మత్యం వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈమేరకు బహుదా నది వరదనీరుతో ఉధృతంగా ప్రవహించడంతో గాజులపల్లె, తొడతర, దిగువమాఘం, పుణ్యసముద్రం గ్రామాల వద్ద బహుదానదిపై నిర్మించిన కాజ్‌వేలపై వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. అలాగే మండలంలోని పలువురు రైతులకు చెందిన పంట పొలాలు కోతకు గురైంది. భారీ వర్షాల కారణంగా బహుదానది, జొన్నగురకల వద్ద గొడ్డువంక. మత్యం వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండంతో పలు గ్రామాలకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.గత కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నిండిపోవడంతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఇదిలా వుండగా శుక్రవారం రాత్రి మండల కేంద్రం తవణంపల్లెలో 82.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.

## మృతి చెందిన విద్యుత్ కార్మికుడు!

సత్యవేడు, అక్టోబరు 4 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలోని బాలకృష్ణా పురంలో విధులు నిర్వహిస్తూ కాంట్రాక్టర్ విద్యుత్ సిబ్బంది ఏ.సుబ్రహ్మణ్యంరెడ్డి (53) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... సుబ్రహ్మణ్యంరెడ్డి గత 30 సంవత్సరాలుగా సత్యవేడు విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారు. మొదట కొద్ది కాలంగా సబ్‌స్టేషన్ సెక్యూరిటీగా విధులు నిర్వహించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు మార్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాలకృష్ణాపురం, కాదిరివేడు ప్రాంతాల్లో విధులు నిర్వహించేవాడు. శనివారం మధ్యాహ్నం విధుల్లో ఉంటూ తెలుగు గంగ జీరో పాయింట్ వద్ద స్నేహితునితో కలసి భోజనం చేసి ఎవరి పనిమీద వారు వెళ్లిపోయారు. సాయంత్రం సుబ్రహ్మణ్యంరెడ్డి బాలకృష్ణాపురం వద్ద పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి ఎంది ఉన్నాడు. విద్యుత్ శాఖ ఏఈ వాసుదేవయ్యను వివరణ కోరగా ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంరెడ్డి విధి నిర్వహణలో మృతి చెందాడు. స్థానికులు మాత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెంది ఉండవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## వైకాపా కుడి చేత్తో ఇచ్చారు... ఎడమ చేతితో లాగేసుకున్నారు! : బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త: జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో వివిధ వర్గాలకు ఇచ్చిన సహాయాన్ని కుడిచేత్తో అ ందించి ఎడమచేతితో లాక్కున్నారని కూటమి ప్రభుత్వం అ ందించే సహాయం నిరుపేదలు, కార్మికులు, కర్షకుల జీవితాల్లో ఆర్థిక పతి పత్తి కల్గిస్తుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రకటించి ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వం పథకంలో రూ.15వేల రూపాయల అందజేత కార్యక్రమాలను పానగల్‌లోని ఓ ప్రవేటు కళ్యాణమండపంలో ఏర్పాటు చేసారు. ఓ వైపు బోరున వర్షం కురుస్తున్నా ఆటో డ్రైవర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఊరందూరు గ్రామం నుంచి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆటోను డ్రైవ్ చేసుకుంటూ ముందు రాగా వెనుక సుమారు 300 ఆటోలు వెన్నంటి శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చారు.ఈ సందర్భంగా సుమారు రూ.3కోట్లు ఆర్థిక సహాయాన్ని 1883 మంది లబ్ధిదారులకుఅ ందజేసారు.

**అన్ని వర్గాలను సంతృప్తి పరచుకుంటూ పరిపాలన:**

ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సహాయాలు,పథకాలు అందించటమే కాకుండా చెప్పని సహాయాలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌లు అమలు చేస్తున్నారని సుధీర్‌రెడ్డి అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం సదుపాయం అములు చేసారన్నారు. వైసిపి పాలనలో పథకాల పేరుతో కుడిచేత్తో పది అందించి ఎడమచేతితో వందలాగేసుకు న్నారన్నారు. వారి పాలనలో గతుకుల రోడ్లతో ఆటోలు పాడయ్యాయని దానికి రిపేర్లు చేయించుకోలేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయనతో పాటు పట్టన తెలుగుదేవం అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు,ఆర్‌టిఓ దామోదర్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్,మాజీ శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్‌గా ప్రకటించిన కొట్టే సాయిలు పాల్గొన్నారు.

## శ్రీకాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ప్రదోష పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం బిక్షాల గోపురం వద్ద వెలసి యున్న శ్రీకాశీవిశ్వనాథస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. శనిత్ర యోదశ సందర్భంగా స్వామికి ఎదురుగా వున్న నందికి ప్రదోష అభిషేకాలు, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్య పాల్గొన్నారు.

## విశాలాక్షికి పలువురి అభినందనలు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త: కలంకారిలో తమ దంటూ వైవిధ్యంతో రాణిస్తూ సామాజిక సేవలో ముందు వరుసలో ఉన్న రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్ సతీమణి కోలా విశాలాక్షికి శనివారం పలువురు అభినందనలు తెలిపారు. కోలా దంపతులు శనివారం జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. వారికి బిజెపి పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి పార్టీ కార్యదర్శి చందురాయల్ వారిని అభినందిస్తూ సత్కరించారు.

## తిరుపతిరూరల్ మండల విద్యాధికారిగా పద్మజ



తిరుపతిరూరల్, అక్టోబర్4 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం విద్యాధికారిగా పద్మజ శనివారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా సిద్దవటం మండల విద్యాధికారిగా ఉన్న ఆమె, బదిలీపై తిరుపతిరూరల్ మండల విద్యాధికారిగా వచ్చారు. మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా ఉన్న మహమ్మద్ రఫీ తిరిగి పాకాల ప్రభుత్వ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడుగా వెళ్లారు. తిరుపతిరూరల్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన పద్మజను కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.